క్లుప్తంగా

పాలిటెక్ ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రత్యేక అవార్డు పొందిన గైస్ విద్యార్థులు

మురళీనగర్ : విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2024 – 25లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలో వీరు రూ.25 వేల కన్సొలేషన్ బహుమతిని మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు యాని మేటెడ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) డ్రోన్‌ను గైస్ విద్యార్థులు పి.భవానీ శంకర్, ఆర్.హైదిరాజు, ఎస్‌కే అబ్దుల్ రజాక్, టి.ప్రసూష్ విద్యార్థుల బృందం రూపొందించింది. వీరికి కెమికల్ బ్రాంచ్ రిటైర్డ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకుడు ప్రదీప్ గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీ



సంక్రాంతి గొబ్బెమ్మల రంగవల్లి వద్ద వనితా వాకర్స్ క్లబ్ మహిళలు

మురళీనగర్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో బుధవారం మధ్యాహ్నం మహిళలకు నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభ చూపారు. వివిధ రకాల రంగులతో తీర్చిదిద్దిన సంక్రాంతి ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విజేతలకు బోగి ఉత్సవాల్లో బహుమతులు అందిస్తామని వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం.జయ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో చేస్తున్న దీక్షలు 1329వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, ప్లాంట్ సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశభక్తి పేరు చెప్పి సంపదను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారపోయడం అన్యాయమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చింది కాదన్నారు. 67 గ్రామాల ప్రజలు ఇళ్లు, పొలాలు, ఆస్తులు త్యాగం చేస్తే వచ్చిందని గుర్తు చేశారు. 61 మంది సీపీఎం నాయకులు స్టీల్ ప్లాంట్ కోసం పదవీ త్యాగాలు చేశారన్నారు. ఈ ఉద్యమంలో 32 మంది బలిదానం చేశారని తెలిపారు. ప్లాంట్ పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ. 50 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లించిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలంటే ఇక్కడి ప్రజల ఆమోదం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, ప్రకాశరావు, వై.రాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కల నెరవేరేనా..?


రాజేంద్రనగర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం


కనకమ్మ వీధిలో ఖాళీగా ఉన్న రెవెన్యూ స్థలం


మినీ బజారు నిర్మాణం కోసం సీతంపేటలో 2018లో వేసిన శిలాఫలకం

జీవీఎంసీ 25, 27, 14వ వార్డు ప్రజల చిరకాల కోరిక రైతుబజారు

- గతంలో శంకుస్థాపన చేసి మరిచిపోయిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు
- హైవే దాటి బజార్‌కు వెళ్లడం కష్టంగా ఉందంటున్న మహిళలు
- వార్డులోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించాలని డిమాండ్

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట పరిసర ప్రాంత ప్రజల చిరకాల కోరిక రైతుబజార్ కల కలగానే మిగిలిపోయింది. వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండేలా రైతుబజార్ నిర్మించాలని కొన్నేళ్లుగా స్థానికులు కోరుతున్నారు. వార్డు పరిధిలో సీతంపేట, రాజేంద్రనగర్, కనకమ్మ వీధి, రెల్లి వీధి, బీటీఆర్ నగర్, గొల్లవీధి, గణేష్‌నగర్, గాయత్రినగర్, హిందూ ముస్లిం కాలనీ, మధురానగర్, శాంతిపురంలో సుమారు 4 వేలకుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. అలాగే 25వ వార్డుకు అనుకుని ఉన్న శ్రీనగర్, ద్వారకానగర్, లలితానగర్, తులసిపేట, రేసపువానిపాలెం, రామాటాకీస్ ప్రాంతంలో నివసిస్తున్న వారంతా కూరగాయలు కొనాలంటే హైవే దాటి సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించి సీతమ్మధార రైతుబజార్‌కు, లేదా నరసింహనగర్ రైతుబజార్‌కు వెళ్లాల్సిందే. దీంతో కూరగాయలకు వెచ్చించే డబ్బులు కంటే ఆటోలకు చెల్లించేదే ఎక్కువగా ఉంటోంది. పైగా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా హైవేను దాటి వెళ్లడం మహిళలు, వృద్ధులకు ప్రహసనంగా మారింది. దీంతో జీవీఎంసీ 25, 27, 14వ వార్డు ప్రజలకు అందుబాటులో ఉండేలా సీతంపేట ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలున్నా ప్రయోజనం శూన్యం

జీవీఎంసీ 25వ వార్డు పరిధి రాజేంద్రనగర్‌లో అపూర్వ ఆస్పత్రి రోడ్‌లో గెడ్డ పక్కన ఉన్న పార్కు స్థలంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కింద రైతుబజార్, పైన కల్యాణ మండపం గానీ, సామాజిక భవనం గానీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కనకమ్మ వీధికి, హరిజన వీధికి మధ్యలో సుమారు రెండు వేల గజాల రెవెన్యూ స్థలం ఉంది. ఆ స్థలంలోనైనా బజారు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కొంత మంది ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రెవెన్యూ సిబ్బంది చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వార్డులో ఎంతో విలువైన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

శంకుస్థాపనకే ఎమ్మెల్యే పరిమితం

సీతంపేట గ్రామ సంఘం వినతి మేరకు కనకమ్మ ఆలయం వద్ద 80 అడుగుల రోడ్‌లో రూ.16 లక్షల వ్యయంతో 30 స్టాల్స్‌తో మినీ బజార్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు 2018లో శంకుస్థాపన చేశారు. అయితే మినీ బజారు ఏర్పాటు కాలేదు. 2019 వరకు ఆయన అధికారంలో ఉన్నా బజారు మాత్రం ఏర్పాటు కాలేదు. మూడు నెలల్లో బజారు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చినా శిలాఫలకానికే పరిమితమైంది. మరలా రెండోసారి ఉత్తర నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా విష్ణుకుమార్ రాజు ఇటీవల ఎన్నికల్లో గెలుపొందారు. ఇప్పుడైనా సీతంపేట వాసుల రైతు బజార్ కల నెరవేర్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

హైవే దాటి వెళ్లడం కష్టం

తాజా కూరగాయలు కొనాలంటే సీతమ్మధార, నరసింహనగర్ రైతుబజార్లకు వెళ్లాలి. జీవీఎంసీ 25, 27 వార్డు ప్రజలకు ఈ బజార్లు చాలా దూరంగా ఉన్నాయి. పైగా హైవే దాటి వెళ్లడం మహిళలకు కష్టంగా ఉంది. ఆటోపై వెళ్లి రావాలంటే వంద రూపాయలకు పైగా ఆటోకే ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అంత దూరం వెళ్లలేక స్థానికంగా ఉన్న దుకాణాల వద్ద అధిక ధరకు కొనుగోలు చేస్తున్నాం.

– ఎస్.కనక మహాలక్ష్మి, గృహిణి, సీతంపేట

నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు

సీతంపేట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాలు నిరుపయోగంగా మారాయి. వాటిని కొంత మంది ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించి, ప్రజల అవసరాల మేరకు వినియోగించాలి. సీతంపేట ప్రాంత వాసులు ఎప్పటి నుంచో రైతుబజార్ ఏర్పాటు చేయమని కోరుతున్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి.

– బి.గోవిందమ్మ, గృహిణి, సీతంపేట

పోర్టు హాస్పిటల్ టెండర్ అడ్డుకుంటాం



పోర్టు హాస్పిటల్ వద్ద 100వ రోజు దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండరు కోసం ఎవరొచ్చినా అడ్డుకుంటామని, ప్రైవేటీకరణను ఆపే వరకు పోరాడతామని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ పద్మనాభరాజు తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 100వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ప్రైవేటీకరణ టెండర్ కోసం ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల కృషితోనే ఆస్పత్రి అభివృద్ధి సాధ్యమైందని, సుమారు 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలందించే ఆస్పత్రి ప్రైవేటీకరణ అనైతికమన్నారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, కేవీస్ కుమార్, నాయుడు పాల్గొన్నారు.

ధర్మారావుకు తెలుగు కీర్తి పురస్కారం



సీతంపేట : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు యం.వి.ధర్మారావు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. తెలుగు సాహిత్యం, సాంస్కృతిక కళ ప్రక్రియల్లో, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రతిభావంతులు, సాహితీమూర్తులకు, కళాకారులకు ఏటా శ్రీశ్రీ కళావేదిక తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలు అందజేస్తోంది. ఈ పురస్కారానికి ధర్మారావు ఎంపిక కావడం పట్ల పాఠశాల హెచ్ఎం లక్ష్మీనరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

గోదా రంగనాథులకు కర్పూర హారతి

సీతంపేట : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో బుధవారం 24వ పాశురం సందర్భంగా గోదా రంగనాథులకు భక్తులు కర్పూర హారతితో నీరాజనం సమర్పించారు. భక్తులు స్వయంగా ఇత్తడి, రాగి, వెండి పళ్లెములలో పచ్చ కర్పూరం వెలిగించి స్వామి వారికి హారతి సమర్పించారు. హారతి సమర్పించడం ద్వారా దృష్టి దోషములు, నరఘోష బాధలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ముందుగా స్వామి వారికి సుప్రభాతం, అర్చన, బాలభోగం, పాశుర విన్నపం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఆ రోజు స్వామి వారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.



గోదా రంగనాథ స్వామికి పచ్చ కర్పూర హారతి సమర్పిస్తున్న భక్తులు



వైభవుని సన్నిధిలో పూజల్లో భక్తులు

వైభవుడికి పొన్నాకుల హారతి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన అనంతరం గోదాదేవి విగ్రహంతో మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరపున శ్రీరంగనాథునికి పాశురం విన్నవించారు. అనంతరం స్వామికి పొన్నాకుల్లో హారతి సమర్పించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని తరించారు. అనంతరం మంగళాశాసనం, విశేష తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. భక్తులు పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు.

పోలీస్ స్టేషన్‌లో కుక్కల బెడద

సీతమ్మధార : బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల ద్వారకా, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ల ఆవరణలో కుక్కలు వీరవిహారం చేస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి రెండు స్టేషన్లకు చెందిన లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం స్టేషన్లకు నిత్యం అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు వస్తుంటారు. అలాగే, పోలీసు అధికారులు, సిబ్బంది కూడా రాకపోకలు సాగిస్తుంటారు. కాగా ఇక్కడ నిత్యం పలు కుక్కలు ఆవరణలోకి స్వేచ్ఛగా వచ్చేసి ఇష్టానుసారంగా తిరగడంతో అటు పోలీసులు, ఇటు ప్రజలు హడలిపోతున్నారు. స్టేషన్ లోపలికి, బయటకి రాకపోకలు సాగించే సిబ్బంది, ప్రజలు కుక్కల కారణంగా భయాందోళన చెందుతున్నారు. కుక్కలను తప్పించుకుని వెళ్లడం కష్టసాధ్యంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పశు వైద్య విభాగం అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో తిరుగుతున్న కుక్కలు

శంకుస్థాపన చేసి.. వదిలేశారంతే..!

- రూ.39 లక్షలతో గ్రీన్‌బెల్ట్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయం
- నెల రోజులు గడిచినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్

సీతమ్మధార : జీవీఎంసీ చేపట్టిన గ్రీన్‌బెల్ట్‌కి ఫెన్సింగ్ పనులు ఇంకా ప్రారంభించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గ్రీన్‌బెల్ట్ అభివృద్ధిలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటు పనులకు గత నెల 9న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అప్పట్లోనే అధికారులను కోరారు. కానీ నెల రోజులు కావస్తున్నా పనులు ప్రారంభించలేదని స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారి మీద 580 మీటర్ల మేరకు గ్రీన్‌బెల్టు ఫెన్సింగ్ ఏర్పాటు కోసం సుమారు రూ.39.79 లక్షలు కేటాయించారు. సత్యసాయి కృపా మందిర్ జంక్షన్ నుంచి గురుద్వారా జంక్షన్ వరకు ఈ ఫెన్సింగ్ పనులు నిర్వహించాల్సి ఉంది. గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడం, మరోవైపు ఆక్రమణల కారణంగా గ్రీన్‌బెల్టు దాదాపుగా ధ్వంసమైపోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం ఎమ్మెల్యే గ్రీన్‌బెల్టు ఫెన్సింగ్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభించలేదని సమాచారం. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్లు స్పందించి గ్రీన్‌బెల్ట్ ఫెన్సింగ్ పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా గాలిపటాల విక్రయాలు

సీతంపేట : సంక్రాంతి పండగ అంటే పిల్లలు కేరింతలు కొడుతూ ఎగురవేసే గాలిపటాలు గుర్తుకొస్తాయి. పండగ సెలవుల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేస్తుంటారు. పిల్లలకు ఎలా గాలిపటాలు ఎగురవేయాలో నేర్పుతూ తల్లిదండ్రులు కూడా సరదాగా గడపుతుంటారు. సంక్రాంతి సెలవులు సమీపిస్తుండడంతో శంకరమఠం రోడ్‌లో, పాలబూత్ సెంటర్‌లో, సంగం ఆఫీస్ కూడలిలో రంగు రంగుల్లో వివిధ రూపాల్లో ఉన్న గాలిపటాలు జోరుగా విక్రయిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. పేపర్, పాలిథిన్, క్లాత్‌తో తయారు చేసిన మూడు రకాల గాలిపటాలు విక్రయిస్తున్నారు. బటర్‌ఫ్లై, షార్క్ చేప, గుడ్లగూబ, గబ్బిలం, గ్రద్ద ఆకారాలతో క్లాత్‌తో చేసిన గాలిపటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బాహుబలి, చోటా భీమ్, టామ్ అండ్ జెర్రీ, స్పైడర్ మ్యాన్, డోరేమాన్, సినీతారల ముఖచిత్రాలతో పేపర్, పాలథిన్‌తో తయారు చేసిన గాలిపటాలు ఆకర్షిస్తున్నాయి. రూ.10ల నుంచి వెయ్యి రూపాయల విలువైన పలు రకాల ఆకర్షణీయమైన గాలిపటాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. గాలిపటం ఎగుర వేయడానికి మాంజియా దారం రూ.50 నుంచి రూ.300 ధరలో వ్యాపారులు విక్రయిస్తున్నారు.











ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీర, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎరుకుమాంబకు అభిషేకం చేస్తున్న భక్తులు

వైభవుడి సన్నిధిలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

రేపు ఉదయం 6.15 గంటల నుంచి దర్శనాలు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆ రోజు ఉదయం 2.45 నుంచి 3 గంటల వరకు నిర్వహించే మంగళధ్వనితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 3 నుంచి 3.30 వరకు శ్రీవారికి సుప్రభాత సేవ, అనంతరం దర్పణ దర్శనం, గోదర్శనం, కన్యాదర్శనం ఉంటుంది. 4 గంటలకు శ్రీవారి అర్చన, మంగళాశాసనం, తిరుప్పావై పఠనం, ఉదయాస్తమాన సేవ, సంపూర్ణ సేవతో పాటు ఇతర ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. 5 గంటలకు వైభవుడికి పల్లకీలో తిరువీధి ఉత్సవం నిర్వహించి ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను గావించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సీనియర్ సిటిజన్స్, వికలాంగులకు మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు, రాత్రి 8 నుంచి 9 వరకు దర్శనభాగ్యం కల్పిస్తామని చెప్పారు. ఆలయ సమీపంలోని సింహాచలం దేవస్థానం స్థలంలో వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు.



వైభవ వేంకటేశ్వర స్వామి



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం